సాక్షి అనకాపల్లి

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



తీవ్ర విషాదం

తాచేరు గెడ్డపై ఉన్న కట్టెల వంతెన మీద నుంచి నడిచి వెళ్తుండగా ఓ గిరిజన మహిళ కాలు జారి గెడ్డలో పడి మృతి చెందింది. 8లో



సుప్రీం తీర్పు అమలు చేయాలి

పెదగంట్యాడ: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పీఎఫ్ పెన్షన్లు ఇవ్వాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ డిమాండ్ చేశారు.



ఓనం..ముగ్గు మనోహరం

ఓనం పండగ సందర్భంగా విశాఖ నగరంలో విశాఖ కేరళా సమితి నిర్వహించిన రంగుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

న్యూస్‌రీల్

రేపు నూకాంబిక ఆలయం మూసివేత



అనకాపల్లి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా గవరపాలెం నూకాంబిక దేవాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి భక్తులకు దర్శనాలు నిలిపివేస్తామని దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయం సంప్రోక్షణ చేసిన అనంతరం సోమవారం ఉదయం 9 గంటల నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. భక్తులు గమనించాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్‌-ఉన్‌-నబీ



కశింకోట ప్రధాన రహదారిలో ఈద్‌-మిలాద్‌-ఉన్‌-నబీ ర్యాలీ

కశింకోట: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని మిలాద్‌–ఉన్‌–నబీ వేడుకను ముస్లింలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని బయ్యవరంలోని హజ్రత్ అన్వర్ మద్‌నీ ఔలియా దర్గా నుంచి కశింకోట వరకు ముస్లింలు సంప్రదాయంగా జెండాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. స్థానిక నూరి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం నూరి మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ రెహమాన్ (బాబర్), పలువురు మౌల్వీలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. ఆయన బోధించిన శాంతి, సహనం, ఐకమత్యం, సోదరభావం వంటివి ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. మహమ్మద్ ప్రవక్త జీవనం మార్గదర్శకమన్నారు. ప్రవక్త వెలిగించిన జ్ఞాన జ్యోతి మానవ జాతికి ఒక దివ్య జ్యోతి అన్నారు. అంతా ఐక్యంగా మతసామరస్యంతో మెలిగి సకల జనుల సౌభాగ్యాన్ని కాంక్షించాలన్నారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. నూర్ మసీదు కార్యదర్శి ఎస్.ఎం.ఎం. అలీ, కమిటీ ప్రతినిధులు అబ్దుల్ ఖలీమ్ అజాద్, మౌలానా నసీం అక్తర్, ఎం.ఎ. రబ్బానీ, నూర్ నభి, ముస్తఫా ఆలం, ఫజుల్ రెహమాన్, ఐ.ఎం. షరీఫ్, సయ్యద్ సలీం, అధికంగా ముస్లింలు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు స్వీకరించిన తిరుమల శ్రీదేవి



భీమునిపట్నం : భీమిలిలోని నెహ్రూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును ఢిల్లీలో శుక్రవారం స్వీకరించారు. ఆమె మన రాష్ట్రం నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన విషయం తెలిసిందే. ప్రత్యేక విధానం ద్వారా విద్యార్థులకు బోధన అందించడం ద్వారా ఆమె ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

గబ్బర్‌సింగ్ గ్రావెల్ దోపిడీ



అమలాపురం కొండల్లో పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

ఆయన జనసేనలో చోటా మోటా నాయకుడు. తమ నాయకుడిపై వీరాభిమానంతో తన పేరుకు గబ్బర్‌సింగ్‌ను తోకగా తగిలించుకున్నాడు. ఈ ప్రాంతంలో ఆ పేరుతోనే సుపరిచితుడు. ఉప సర్పంచ్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతని అక్రమాలు తార స్థాయికి చేరాయి. నక్కపల్లి మండలంలో కంపెనీల కోసం ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో గ్రావెల్ తవ్వకాల్లో ఆరితేరిపోయాడు.

- ఏపీఐఐసీ భూముల్లో ఖనిజ సంపద లూటీ చేస్తున్న జనసేన నాయకుడు
- కూటమి పెద్దల అండదండలతో కారిడార్ భూముల్లో తవ్వకాలు
- పవన్ వీరాభిమానినంటూ గబ్బర్ సింగ్ పేరు
- నిత్యం వందలాది లారీల్లో తరలింపు
- రోజుకు లక్షల్లో అక్రమ సంపాదన

నక్కపల్లి: కొండలు, గుట్టలు కావేవీ అక్రమాలకు అనర్హం.. అన్న రీతిలో ఆ నాయకుడు వ్యవహరిస్తున్నాడు. బల్క్‌డ్రగ్ పార్క్ పనులు అతనికి వరంగా మారాయి. అధికారుల అండతో అందినంత కొల్లగొట్టేస్తున్నాడు. ప్రభుత్వం చందనాడ, అమలాపురం, వేంపాడు, డీఎల్ పురం, రాజయ్యపేట, బోయపాడు, మూలపర, పాటిమీద గ్రామాల్లో 4500 ఎకరాలను సేకరించింది. వీటిలో బల్క్‌డ్రగ్ పార్క్ కోసం 2 వేల ఎకరాలు, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం 2 వేల ఎకరాలు కేటాయించింది. బల్క్‌డ్రగ్ పార్క్‌కు ప్రభుత్వం ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, మినీ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఈ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జాతీయ రహదారి నుంచి తమ్మయ్యపేట వరకు రూ.24 కోట్లతో 80 అడుగుల రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులకు ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకుంది. ఈ పనులకు గ్రావెల్ అవసరం ఉంది. ఏపీఐఐసీ పరిధిలో కొండలు, గ్రావెల్ పుష్కలంగా అందుబాటులో ఉంది. ఏపీఐఐసీ పరిధిలో ఉన్న ఒక గ్రామానికి ఉప సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న ఈ గబ్బర్‌సింగ్ కూటమి ప్రభుత్వ పెద్దలతో తనకున్న పరిచయాలు, పరపతిని ఉపయోగించి ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వి ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు.

నిబంధనలు బేఖాతర్

నిబంధనల ప్రకారం మైనింగ్ అధికారుల అనుమతితోనే గ్రావెల్ తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. అయితే మౌలిక సదుపాయలు కల్పించే పనులకు గ్రావెల్ సరఫరా చేస్తున్నానంటూ గబ్బర్‌సింగ్ ఇక్కడ గ్రావెల్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాడు. పొక్లెయిన్‌లతో తవ్వేసి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న కంపెనీలకు ప్రతిరోజు వందలాది టిప్పర్లలో గ్రావెల్ సరఫరా చేస్తున్నాడు. ఏపీఐఐసీ ముసుగులో గ్రావెల్ అమ్మేసుకుంటున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకండా కూటమి ప్రభుత్వ అండదండలతో ఇతను చేస్తున్న అరాచకాలను అడ్డుకునే సాహసం ఏ అధికారి చేయడం లేదు. నిత్యం లక్షలాది రూపాయల ఆదాయం పొందుతున్న ఇతగాడు, తనకు వచ్చే ఆదాయంలో కొంత భాగం కూటమి ప్రభుత్వ పెద్దలకు కూడా సమర్పించుకుంటున్నాడు. ఇళ్ల నిర్మాణాలకు, సొంత అవసరాలకు ఎవరైనా ట్రాక్టర్ గ్రావెల్ పట్టుకెళ్తే దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్న పోలీసులు, రెవెన్యూ మైనింగ్ అధికారులు గబ్బర్ సింగ్ చేస్తున్న గ్రావెల్ దోపిడీ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని చుట్టుపక్కల గ్రామాల వారు ఆరోపిస్తున్నారు.



గబ్బర్‌సింగ్ టిప్పర్లలో తరలిపోతున్న గ్రావెల్

అధికారుల అండదండలు

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాల్సిన కొంతమంది అధికారులు సైతం అక్రమాల్లో భాగస్వాములవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. కీలక శాఖల్లో ఉన్నతాధికారిగా ఉన్న ఒక వ్యక్తి రెండు టిప్పర్లను ఈ గ్రావెల్ తరలింపు కోసం లీజు పద్ధతిలో ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వద్ద ఉంచినట్లు చెప్పుకుంటున్నారు. కూటమి నేతలు, కీలక ప్రభుత్వ శాఖల అండదండలతోనే గబ్బర్‌సింగ్ గ్రావెల్ దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమలాపురం, మూలపర, డీఎల్ పురం కొండల నుంచి రేయింబవళ్లు యంత్రాలను ఏర్పాటు చేసి వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వేస్తున్నాడని చెప్పుకుంటున్నారు. గతంలో పలు పర్యాయాలు కూటమి నేతల్లో వచ్చిన పంపకాల తేడా వల్ల ఒకరి వాహనాలను ఒకరు పట్టించుకుని కేసులు నమోదు చేయించుకోవడం, హోం మంత్రి వద్ద పంచాయతీ పెట్టడం జరిగింది. మనలో మనకు ఐక్యత లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని ఒక అవగాహనకు వచ్చి ట్రిప్పుకు ఇంత అని బేరం కుదుర్చుకుని గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు చేసుకోకుండా రాజీ పడ్డారని భోగట్టా. ఈ వ్యవహారంలో అధికారులకు సైతం మామూళ్లు భారీగానే అందుతున్నాయి. ఉచితంగా లభించే గ్రావెల్‌ను టిప్పర్ ధర రూ.10 వేలుగా నిర్ణయించి సమీపంలో ఉన్న కంపెనీలకు, ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారికి విక్రయించి కోట్లు గడిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో గబ్బర్‌సింగ్ వేంపాడు రెవెన్యూలో క్షత్రియులకు చెందిన 7 ఎకరాల జిరాయితీ మిగులు భూమిని తన పలుకుబడిని ఉపయోగించుకుని రికార్డులు తారుమారు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాడు. తర్వాత ఇదే భూమిని కొనుగోలు చేసి తన పేరున మార్చేసుకున్నాడు. ఏపీఐఐసీ నుంచి నష్టపరిహారం పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను తెలుసుకున్న అసలు హక్కుదార్లు లబోదిబోమంటూ కలెక్టర్, హోం మంత్రి, రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉంది.



దర్జాగా దోపిడీ

స్పీకర్‌కు చేతనైతే.

- మెడికల్ కళాశాల ప్రైవేటుపరం కాకుండా ఆపాలి
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ నవాల్



నర్సీపట్నం: స్పీకర్ అయ్యన్నపాత్రుడికి చేతనైతే నర్సీపట్నం మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం కాకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మేలు చేకూరాలనే ఆలోచనతో నాటి సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాల మంజూరు చేశారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2019 వరకు ఏపీలో 11 మెడికల్ కళాశాలలు ఉండగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేశారన్నారు. సుమారు రూ.500 కోట్లతో 630 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టారన్నారు. నిర్మాణం పూర్తయి ఈ కళాశాల ప్రారంభమైతే 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రావడమే కాక వేలాది మందికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేవన్నారు. మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేయడానికి మంత్రివర్గం నిర్ణయం తీసుకోవటం దురదృష్టకరమన్నారు. ఈ మెడికల్ కళాశాల ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించాల్సిన కళాశాలలో వైద్య ఖర్చులు చెల్లించుకునే పరిస్థితికి కూటమి ప్రభుత్వం తీసుకువస్తోందన్నారు. నర్సీపట్నం మెడికల్ కళాశాల ప్రైవేటుపరం అయితే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ ప్రాంత ప్రజలకు ద్రోహం చేసినవారవుతారన్నారు. చేతనైతే మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించేలా స్పీకర్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులపై 'గురు'తర బాధ్యత



జ్యోతి ప్రజ్వలన చేసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

- రేపటి పౌరులను తీర్చిదిద్దాల్సింది వారే
- గురుపూజోత్సవంలో హోం మంత్రి అనిత

అనకాపల్లి టౌన్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గురుపూజోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థులకు అందిస్తున్న బ్యాగులు, దుస్తులపై సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటోలు ముద్రించాలని మంత్రి కోరారు. కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనలో మార్పులను తీసుకురావాలని ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయుల కృషితో 2024–25 సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ఉత్తీర్ణత శాతం 5వ స్థానానికి తెచ్చామన్నారు. ప్రతీ పాఠశాలలో యూత్ క్లబ్, మాదకద్రవ్యాల నిరోధక కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా 39 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు మంత్రి అనిత అవార్డులు అందజేశారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆరుగురు, స్కూల్ అసిస్టెంట్స్ 20 మంది, ఎస్‌జీఎస్‌టీ టీచర్లు 13 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి అవార్డులు



కె.కోటపాడు/బుచ్చెయ్యపేట/నర్సీపట్నం/రోలుగుంట: విజయవాడలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకుంటున్న డి.గోపీనాథ్ (శివపురం ప్రాథమిక పాఠశాల, నర్సీపట్నం), ఎల్.వి.నారాయణరావు (గొందుపాలెం హైస్కూల్), నాగజ్యోతి (రోలుగుంట జెడ్పీ హైస్కూల్), జి.చిన్నారావు (వడ్డాది ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్)



జిల్లా స్థాయి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు కె.సుభాష్ చంద్రబోస్ (తామరబ్బ ఎంపీయూపీ స్కూల్, దేవరాపల్లి), చంద్రశేఖర్ (వెలంకాయలపాలెం ఎంపీపీ పాఠశాల, రోలుగుంట), డి.రవి (మాకవరపాలెం ఉన్నత పాఠశాల) , డీఆర్‌కే శాస్త్రి (నక్కపల్లి), కె.దండెంనాయుడు, (ఎంపీపీ స్కూల్, పాత వాలాబు, దేవరాపల్లి), జి.వి.రమణ (భీమవరం ఎంపీపీ స్కూల్, ఎస్.రాయవరం), ఎం.మురళీకృష్ణ (కె.కోటపాడు హైస్కూల్), ఎ.వి.రామాచార్యులు (ఎస్.రాయవరం హైస్కూల్), నిమ్మల రమ (వడ్డాది ఎంపీపీ స్కూల్)

యూరియా సరఫరాలో సర్కారు విఫలం

- 9న కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల వద్ద రైతులతో నిరసన
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వ్యవసాయం పెద్ద దండగ అని భావించే సీఎం చంద్రబాబు పాలనలో మళ్లీ రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందజేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల వద్ద రైతులతో నిరసన తెలియజేసి, వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నాటి సీఎం వైఎస్ జగన్ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు యూరియా తదితర ఎరువులు సరఫరా చేశారని, కూటమి పాలనలో ఆర్బీకేల పేరు మార్చారు తప్ప అన్నదాతల గురించి పట్టించుకోవడం లేదన్నారు. యూరియా సరఫరా చేయాలని రైతులు ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడతామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అనకాపల్లి పట్టణంలో అన్నపూర్ణ బ్యాంక్ వద్ద రైతులు రాత్రి వరకూ పడిన ఇబ్బందులను వీడియో ద్వారా విలేకరులకు ఆయన ప్రదర్శించారు. రైతులకు కావలసిన యూరియా పీఏసీఎస్‌లో 30 శాతం ఉంటే, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో 70 శాతం ఉందన్నారు.

మెడికల్ కళాశాల ప్రైవేటుపరానికి కుట్ర

వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాకో మెడికల్ కళాశాలను మంజూరు చేయగా.. ఇప్పుడు వాటిని పీపీపీ పద్ధతిలో చేపట్టి ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. అనకాపల్లిలో మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేస్తే, స్థానిక నేతలు అడ్డుకుని కోర్టులో కేసులు వేయడం వలన నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలేనికి మార్చామన్నారు. గత పాలనలో రెండో అంతస్తు వరకూ పనులు చేయగా, కూటమి పాలన వచ్చాక పనులు నిలిచిపోయాయన్నారు. అనకాపల్లి, చోడవరం, మాడుగుల రహదారి పరిస్థితి చూస్తే ఎందుకు గెలిపించుకున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

సుగర్ ఫ్యాక్టరీల అడ్రస్ గల్లంతు

జిల్లాలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మూసివేసే విధంగా కూటమి ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారని అమర్‌నాథ్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి రూ.90 కోట్లు, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీకి సుమారు రూ.40 కోట్లు ఇచ్చి ఆదుకున్నామన్నారు. ఏడాది కూటమి పాలనలో గోవాడ సుగర్స్ బకాయిలు రూ.35 కోట్లు ఉన్నాయని, చెరకు పండించే రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని ఎమ్మెల్యేలు చెప్పడం దారుణమన్నా రు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు మలసాల భరత్‌కుమార్, అన్నపురెడ్డి అదీప్‌రాజు, కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ పాల్గొన్నారు.

పట్టాల పండగ.. ఆనందం నిండుగ

- ఘనంగా డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవం
- ఐదు బ్యాచ్‌ల విద్యార్థులకు పట్టాల ప్రదానం
- అతిథులుగా హాజరైన సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు
- పట్టాలతో కేరింతలు కొట్టిన విద్యార్థులు



దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొన్న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ పి.నరసింహా, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, వీసీ సూర్యప్రకాశరావు

విశాఖ సిటీ: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) పట్టభద్రుల కేరింతలతో బీచ్‌రోడ్డు మార్మోగిపోయింది. తెలుగు రాష్ట్రాల నుంచే దేశంలో పలు రాష్ట్రాల నుంచి విశాఖలో న్యాయ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు నోవాటెల్ హోటల్‌లో సందడి చేశారు. శుక్రవారం హోటల్‌లో డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. గత ఐదేళ్లలో యూనివర్సిటీలో పలు కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి పట్టాల అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, అతిథులుగా జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ పి.నరసింహా, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ హాజరయ్యారు. అతిథుల చేతుల మీదుగా విద్యార్థులను బంగారం, వెండి పతకాలతో పాటు పట్టాలను అందజేశారు. ఇందులో 397 మంది బీఏ ఎల్ఎల్‌బీ, 153 మందికి ఎల్ఎల్ఎం, నలుగురికి పీహెచ్‌డీ, ఇద్దరికి ఎల్ఎల్‌డీ పట్టాలు అందించారు. అలాగే 153 మందికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. బ్యాచ్ వారీగా విద్యార్థులు న్యాయమూర్తులతో ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు తమ జీవిత అనుభవాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు జీవితంలో ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల సందడి : కోవిడ్, ఇతరత్రా కారణాలతో గత ఐదేళ్లుగా డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవం వాయిదా పడుతూ వస్తోంది. ఈ ఐదేళ్లలో న్యాయ విద్యను పూర్తి చేసిన వారు ఇప్పటికే న్యాయవాదులుగా ప్రాక్టీసు ప్రారంభించారు. 8 నుంచి 12 బ్యాచ్‌లకు ఒకేసారి పట్టాలు అందించేందుకు డీఎస్ఎన్ఎల్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.సూర్యప్రకాశరావు స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. దీంతో సందడి నెలకొంది.



గుంటూరుకు చెందిన జ్యోతిర్మయికి మాస్టర్స్ పట్టా ప్రదానం

క్లుప్తంగా

ఎరుకలమ్మకు పదోన్నతి



గొలుగొండ: కృష్ణదేవిపేట రేంజ్ పరిధిలో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా పనిచేసిన ఎరుకులమ్మకు పదోన్నతి వచ్చింది. ఆమె ఫారెస్టు సెక్షన్ అధికారిగా పదోన్నతి పొందినట్లు కృష్ణదేవిపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. ఇక్కడ మూడు సంవత్సరాలకు పైగా ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా పనిచేసిన ఎరుకులమ్మ అటవీ పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోనే త్వరగా పదోన్నతి వచ్చినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఫారెస్టు సెక్షన్ అధికారిగా చింతపల్లిలో ఆమె విధులు నిర్వహించనున్నారు.

13 వరకు విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పెందుర్తి-సింహాచలం పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 6, 8, 10, 12వ తేదీల్లో విశాఖపట్నం-బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 7, 9, 11, 13వ తేదీల్లో బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 7, 9, 11, 13వ తేదీల్లో విశాఖపట్నం-విజయనగరం(67287) పాసింజర్‌ను రద్దు చేశారు. ఈ నెల 7, 9, 11, 13వ తేదీల్లో పలాస-విశాఖపట్నం (67290) పాసింజర్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది.

'బొకారో'దారి మళ్లింపు.. అదనపు హాల్ట్
సదరన్ రైల్వే, సేలం డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల వల్ల ఈ నెల 7న అలప్పుజ-ధన్‌బాద్(13352)బొకారో ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఆ తేదీన ఈ రైలు వయా పొదనూర్ జంక్షన్-ఇరుగూర్ జంక్షన్, సేలం మీదుగా ప్రయాణిస్తుంది.ప్రయాణికుల సౌకర్యార్థం పొదనూర్‌లో అదనపు హాల్ట్ కూడా కల్పించారు.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలిక హాల్ట్
నార్తర్న్ రైల్వే, ఢిల్లీ డివిజన్ పరిధిలోని భోద్వాల్ మజ్రిలో జరగనున్న 78వ వార్షిక అంతర్జాతీయ నిరంకారీ సంత్ సమాగం కారణంగా హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ స్టేషన్‌లో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. అక్టోబరు 19 నుంచి నవంబరు 7 వరకు ఈ తాత్కాలిక హాల్ట్ ఉంటుంది. అమృత్‌సర్-విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ భోద్వాల్ మజ్రి స్టేషన్‌కు ఉదయం 5.52 గంటలకు చేరుకుని, 5.54 గంటలకు బయలుదేరుతుంది. అలాగే, విశాఖపట్నం-అమృత్‌సర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 3.48 గంటలకు చేరుకుని, 3.50 గంటలకు బయలుదేరుతుంది.

తీవ్ర విషాదం.. ఎవరిదీ పాపం.!

- తాచేరు కట్టెల వంతెన మీద నుంచి కాలు జారి పడి గిరిజన మహిళ మృతి
- తాటిపర్తి శివారు ఆజయపురం గ్రామస్తులకు ఈ కట్టెల వంతెనే దిక్కు
- మృతదేహంతో గిరిజనుల నిరసన



మృతదేహంతో ఆజయపురం వెళ్లే కట్టెల వంతెన మీద నిరసన తెలుపుతున్న గిరిజనులు, (ఇన్‌సెట్) పాంగి మచ్చమ్మ(ఫైల్)

మాడుగుల రూరల్: తాచేరు గెడ్డపై ఉన్న కట్టెల వంతెన మీద నుంచి నడిచి వెళ్తుండగా ఓ గిరిజన మహిళ కాలు జారి గెడ్డలో పడి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో తాటిపర్తి పంచాయతీ శివారు ఆజయపురం గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళ పాంగి మచ్చమ్మ(26) పామాయిల్ తోటలో కూలి పనికి వెళ్లింది. పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గురువారం రాత్రి తాచేరు గెడ్డలో కట్టెల వంతెన మీద నుంచి నడిచి వెళ్తుండగా కాలు జారి గెడ్డలో పడి మృతి చెందింది. ఈ గ్రామానికి వంతెన లేకపోవడంతో తాత్కాలికంగా గిరిజనులు కట్టెల వంతెన నిర్మించుకున్నారు. మచ్చమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు లబోదిబోమని రోదించారు. మృతురాలి భర్త మత్స్యరాజు శుక్రవారం ఉదయం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ జి.నారాయణరావు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని శుక్రవారం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శుక్రవారం సాయంత్రం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, అత్తమామలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

గిరిజన మహిళ మృతి ప్రభుత్వానిదే బాధ్యత
పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆజయపురం వెళ్లే రహదారిలో తాత్కాలిక వంతెన మీద మృతదేహంతో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన జిల్లా కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి, మాట్లాడుతూ ఆజయపురం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. తాటిపర్తి నుంచి ఆజయపురం గ్రామానికి మధ్యలో గెడ్డపై కర్రలతో కాలిబాట వంతెన నిర్మించుకున్నారని, ఈ వంతెన మీద నడుస్తూ గెడ్డలో పడి మహిళ మృతి చెందిందని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శంకరం పంచాయతీలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

తీగ తెగితే తాచేరు నదిలో గల్లంతే!



తాచేరు నదిలో తాడు సహాయంతో వెళ్తున్న గ్రామస్తులు



గండి వద్ద నది దాటేందుకు సిద్ధంగా ఉన్న ప్రజలు

బుచ్చెయ్యపేట: మండలంలోని భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట తాచేరు నదిలో తాడు సహాయంతో దిగి పలువురు ప్రమాదం అంచున ప్రయాణాలు చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న తాచేరు వంతెన కూలిపోగా తాత్కలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు నెల రోజుల కిందట వర్షాలకు కొట్టుకుపోయింది.

దీంతో నదికి అవతల, ఇవతల పొలాలు ఉన్న విజయరామరాజుపేట రైతులు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండగా తీగ సహాయంతో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. పేట రైతులకు ఏ అవసరం వచ్చినా వడ్డాది వచ్చి సరకులు కొనుగోలు, అత్యవసర సమయంలో రోగులు ఆసుపత్రికి వెళ్లడానికి, మందులు కొనుగోలు చేయడానికై తాచేరు నదిలో దిగి నీటిలో నుంచి నడిచి వెళ్తున్నారు. ఏప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. పాలకులు, అధికారులు తక్షణం కూలిన వడ్డాది, తాచేరు వంతెనలు, డైవర్షన్ రోడ్ల నిర్మాణాలు చేపట్టి రవాణా సదుపాయం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కరెంట్ సమస్య.. క్షణాల్లో పసిగట్టేలా..



- ఈపీడీసీఎల్ పరిధిలో సబ్‌స్టేషన్లకు 'స్కాడా' అనుసంధానం
- మొదటి విడతలో 40 స్టేషన్లలో అమలు
- మరో 24 సబ్‌స్టేషన్లలో పనులు వేగవంతం



స్కాడా పరిధిలోని సబ్‌స్టేషన్లను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: ఒకప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే, సమస్య ఎక్కడుందో కనుగొనడానికి సిబ్బంది క్షేత్రస్థాయిలో గంటల తరబడి శ్రమించాల్సి వచ్చేది. లోపం ఉన్న ప్రాంతాన్ని గుర్తించి, సబ్‌స్టేషన్‌కు సమాచారమిచ్చి, విద్యుత్ సరఫరా నిలిపివేసిన తర్వాత మరమ్మతులు చేసేవారు. ఈ ప్రక్రియకు గంట నుంచి రెండు గంటల సమయం పట్టేది. కానీ, ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో పరిస్థితులు మారాయి. ఇప్పుడు విద్యుత్ సరఫరాలో లోపం ఎక్కడ తలెత్తిందో క్షణాల్లోనే కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తోంది. ఆ సమాచారంతో సంబంధిత సిబ్బంది కేవలం 5 నుంచి 30 నిమిషాల్లోనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. ఇది తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో అమలు చేస్తున్న సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్ (స్కాడా) వ్యవస్థతో సాధ్యమవుతోంది. విశాఖపట్నం సర్కిల్ పరిధిలో ఇప్పటికే సగానికి పైగా సబ్‌స్టేషన్లు స్కాడాతో అనుసంధానం కావడంతో నగరవాసులకు విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గాయి.

స్కాడా అంటే..?
విద్యుత్ సరఫరా వ్యవస్థను ఒకే కేంద్రం నుంచి పర్యవేక్షిస్తూ.. సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించి, సరఫరాను పునరుద్ధరించడానికి ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవస్థే స్కాడా. ఇది సెన్సార్లు, రిమోట్ టెర్మినల్ యూనిట్ల ద్వారా సబ్‌స్టేషన్లను కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానిస్తుంది. ఆపరేషనల్ టెక్నాలజీ ద్వారా రియల్ టైమ్ డేటాను సేకరించి, వ్యవస్థను పూర్తిస్థాయిలో నియంత్రించడానికి వీలు కల్పిస్తుంది. సాధారణంగా సబ్‌స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్లు చేసే పనులను స్కాడా కంట్రోల్ సెంటర్ నుంచే ఆటోమేటిక్‌గా, రిమోట్ సెన్సార్ల సహాయంతో నిర్వహిస్తారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో...
విశాఖ నగరంలో స్కాడా ఏర్పాటుకు 2013లో ప్రతిపాదనలు రాగా, 2014లో రూ.13.16 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. 2015 నుంచి మొదలుపెడితే 28 సబ్‌స్టేషన్లను స్కాడా కంట్రోల్ స్టేషన్‌కు అనుసంధానం చేశారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరవాత మరో 12 స్టేషన్లను అనుసంధానం చేయడంతో పాటు మరో 24 సబ్‌స్టేషన్లను స్కాడా పరిధిలోకి తీసుకొచ్చే పనులు ప్రారంభమై.. చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఈ సబ్‌స్టేషన్లలోనూ స్కాడా అమలుకానుంది. విశాఖపట్నం సర్కిల్ పరిధిలో మొత్తం 130 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉండగా, ప్రస్తుతం 40 స్టేషన్లు ఈ ఆధునిక వ్యవస్థ ద్వారా పనిచేస్తున్నాయి. మరో 24 స్టేషన్లలో త్వరలోనే సేవలు మొదలుకానున్నాయి. మిగిలిన కేంద్రాలను కూడా భవిష్యత్తులో అనుసంధానించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కంట్రోల్ సెంటర్ ఎక్కడంటే..?
స్కాడా పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లను పెదవాల్తేరులోని పోలమాంబ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తారు. ఇది అత్యంత కీలకమైన, సాంకేతికతతో కూడిన కార్యాలయం కావడంతో దీనిని నియంత్రిత ప్రాంతంగా (నిషిద్ధ ప్రాంతం) పరిగణిస్తారు. సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి నగర విద్యుత్ వ్యవస్థను అస్తవ్యస్తం చేసే ప్రమాదం ఉన్నందున ఇక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈపీడీసీఎల్ ప్రత్యేక నిపుణుల బృందం (ఈఈ, డీఈఈ, ఏఈ స్థాయి అధికారులు)తో పాటు 8 మంది షిఫ్ట్ ఇంజినీర్లు) ఈ కేంద్రాన్ని 24/7 పర్యవేక్షిస్తోంది. స్కాడాకు అనుసంధానించిన సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో లోపం వస్తే, వెంటనే కంట్రోల్ రూమ్‌లో అలారమ్స్ మోగుతాయి. హై వోల్టేజ్, లో వోల్టేజ్ వంటి హెచ్చుతగ్గులను కూడా ఈ కేంద్రం నుంచే నియంత్రించవచ్చు. ఏ ప్రాంతానికి ఎంతసేపు విద్యుత్ సరఫరా చేశారు, ఎంతసేపు కోతలు విధించారు, లోడ్ ఎంత ఉంది వంటి సమాచారం మొత్తం రియల్ టైమ్ డేటా రూపంలో నిక్షిప్తమవుతుంది.

ప్రమాదాలు తగ్గుముఖం



స్కాడా కంట్రోల్ స్టేషన్ నుంచి నిరంతర పర్యవేక్షణ ఉండటంతో.. ప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నాయి. విద్యుత్ సరఫరాలో నాణ్యత ఉంటోంది. స్కాడాకి అనుసంధానం చేయడం వల్ల సరఫరాలో అంతరాయాలు గుర్తించి, పునరుద్ధరించడంలో 56 శాతం వరకు సమయం ఆదా అవుతోంది. పవర్ ట్రిప్ అయితే రియల్ టైమ్‌లో తెలుస్తోంది. స్క్రీన్‌పై నుంచే వోల్టేజ్, ఇతర అంశాల్ని నిశితంగా పరిశీలించవచ్చు. ఏ చిన్న సమస్య తలెత్తినా.. పసిగట్టగలుగుతున్నాం. గతంలో ఫీడర్ మార్పు చేసేందుకు 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టేది. ఇప్పుడు 2 లేదా 3 నిమిషాల్లో ఫీడర్‌ని మార్పు చేయగలుగుతున్నాం. గ్రామస్థాయిలో ఫీడర్ల వరకూ స్కాడా అనుసంధానం చేసేందుకు కొంత సమయం పడుతుంది.

–జి.శ్యామ్‌బాబు, విశాఖపట్నం సర్కిల్ ఎస్‌ఈ

దొంగతనాలకు పాల్పడుతున్న యువకుల అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నమ్మి గణేష్

అచ్యుతాపురం రూరల్ : రెండు నెలల వ్యవధిలో మండలంలో పలు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామానికి చెందిన నలుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు సీఐ నమ్మి గణేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డీఎస్పీ విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో నియమించిన ప్రత్యేక బృందంతో విచారణ చేపట్టి చోరీలకు పాల్పడిన నలుగుర్ని అదుపులోకి తీసుకున్నట్లు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో జోగన్నపాలెం, మార్టూరు, దొరైపాలెం, పైలవానిపాలెం, వెంకటాపురం గ్రామాల్లో మొత్తం ఐదు ఆలయాల హుండీలను చోరీ చేసినట్టు గుర్తించామని, వారి నుంచి రూ.7650 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా వ్యసనాలకు బానిసలయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లల నడవడికను ప్రతిక్షణం గమనించాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులెవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. వీలైనంత వరకూ వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు తెలియపరిచి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐలు సుధాకర్, వెంకటరావు, సిబ్బంది బంగార్రాజు, అనిల్ పాల్గొన్నారు.

డీఎస్ఎన్ఎల్‌యూలో అకడమిక్ బ్లాక్ ప్రారంభం



నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్‌ను హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలిసి ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీనరసింహ తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తి, విశ్వవిద్యాలయ విజిటర్ జస్టిస్ పి.శ్రీనరసింహ శుక్రవారం ప్రారంభించారు. దీంతో పాటు వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ పిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, తొలి దళిత ముఖ్యమంత్రి, దామోదరం సంజీవయ్య విగ్రహాలను హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వర్సిటీ సమావేశమందిరంలో వాతావరణ మార్పులు, చట్టాలు అనే అంశంపై జస్టిస్ ఇ.వెంకటేశం స్మారక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ సూర్యప్రకాశరావు, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ విశ్వచంద్ర మదాసీ పాల్గొన్నారు.

వృద్ధులకు రైలు ప్రయాణంలో రాయితీ ఇవ్వాలి

అనకాపల్లి టౌన్: వృద్ధులకు రైళ్లలో ప్రయాణించడానికి రాయితీతో కూడిన టికెట్లను ఇవ్వాలని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. స్థానిక వీవీ రైతు భారతి హాల్‌లో శుక్రవారం జరిగిన జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ సిటిజన్‌లకు సరైన రాయితీలు ఇవ్వడం లేదన్నారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యుడు బుద్ధ రమణాజీని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బీశెట్టి కృష్ణ అప్పారావు, కోశాధికారి ఆడారి అప్పారావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, కర్రి జగ్గ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్వయంభూ విఘ్నేశ్వరుని లడ్డూ వేలం



అప్పలనాయుడుకు లడ్డూ అందిస్తున్న ఎమ్మెల్యే

చోడవరం : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరుని సన్నిధిలో ఉంచిన లడ్డూకు కమిటీ సభ్యులు గురువారం రాత్రి వేలం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిపిన వేలం పాటలో లడ్డూను కె.కోటపాడు మండలం చౌడువాడ గ్రామానికి చెందిన తనకల అప్పలనాయుడు రూ.30 వేలకు దక్కించుకున్నారు. స్వయంభూ విఘ్నేశ్వరుని సన్నిధిలోని లడ్డూను దక్కించుకోవడం ఆనందంగా ఉందని పాటదారుడు తెలిపారు.

రైతుకు ఒకే ఒక బస్తా



యూరియా కోసం రైతుల నిరీక్షణ

- యూరియా కోసం అన్నదాతల వాగ్వాదం
- పి.కె.గూడెం పీఏసీఎస్‌లో అవస్థలు

నాతవరం: పి.కె.గూడెం పీఏసీఎస్‌లో శుక్రవారం తగినంత యూరియా పంపిణీ చేయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ముందు రోజున ఎరువులు విక్రయిస్తామని చెప్పడంతో శుక్రవారం ఉదయం నుంచి అధిక సంఖ్యలో రైతులు చేరుకున్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఒక్కంటికీ ఒక్కబస్తాయే పంపిణీ చేశారు. పాసుపుస్తకంలో ఉన్న భూమి విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఒకే ఒక బస్తా సరఫరా చేయడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పి.కె.గూడెం పి.జగ్గంపేట గ్రామాలకు చెందిన రైతులు ఒకేసారి రావడంతో యూరియా అయిపోతుందన్న భయంతో ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. ఒక లారీలో యూరియా 267 బస్తాలే రావడంతో తోపులాట చోటుచేసుకుంది.

సచివాలయమా? కూటమి కార్యాలయమా?



ఉమ్మలాడలో సచివాలయ ప్రధాన గేటు ముందు కూటమి నేతల ఫ్లెక్సీలు

మునగపాక: విద్య, వైద్య కేంద్రాల సమీపంలో రాజకీయ నేతల ఫ్లెక్సీలు ఉండరాదన్న నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. అధికారంలో ఉన్నాం కదా అడిగేదెవరన్న రీతిలో నేతలు వ్యవహరిస్తున్నారు. ఉమ్మలాడలో సచివాలయం ప్రధాన గేటు ముందు కూటమి నేతల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నెల దాటినా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం సచివాలయానికి పలు సేవల కోసం ప్రజలు వస్తూ పోతుంటారు. స్థానికంగా ఉన్న నేతలు తమ అధినాయకుల పట్ల స్వామి భక్తుని చాటేందుకు నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా అధికారులు వాటిని తొలగించకపోవడం విచారకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరణించి నలుగురికి వెలుగునిచ్చి..



మృతుడు శ్రీను

పెందుర్తి : బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన ఓ వ్యక్తి నేత్రాలను దానం చేసి ఓ కుటుంబం మానవత్వం చాటుకుంది. వివరాలివి.. పెందుర్తి ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్న కోరుబిల్లి శ్రీను(40) క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి శ్రీను ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ క్రమంలో శ్రీను సమీప బంధువు శరగడం రాము(కర్రల రాము) చొరవతో కుటుంబ సభ్యులు శ్రీను నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు శ్రీను నేత్రాలను సేకరించారు. ఇటీవల కాలంలో విస్తృతంగా నేత్రదానం చేయిస్తున్న పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ స్ఫూర్తిలో తాము ఈ నేత్రదానం చేసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

క్లుప్తంగా

నేలకొరిగిన భారీ వృక్షం



నేలకొరిగిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న పోలీసులు

అనకాపల్లి టౌన్: మండలంలోని జాతీయ రహదారిలో కొండ కొప్పాక గ్రామం జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి భారీ చెట్టు నేలకొరిగింది. దీంతో విశాఖపట్నం నుంచి అనకాపల్లి వైపు కొప్పాక జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. హుటాహుటిన రూరల్ సీఐ జి.అశోక్ కుమార్, ఎస్ఐ రవి కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని రహదారికి అడ్డంగా ఉన్న చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పంచాయతీ పారిశుధ్య కార్మికుల ర్యాలీ



కశింకోటలో ర్యాలీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కశింకోట: ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి రూ. 4 వేలు వంతున మెడికల్ అలవెన్స్ సత్వరమే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీల పారిశుధ్య కార్మికులు ప్రదర్శన చేశారు. ఈ మేరకు ఎంపీడీవో ధర్మారావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ తోట తాతారావులకు వినతి పత్రాలను అందజేశారు. నాలుగు నెలలుగా అందని వేతన బకాయిలను చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఐదేళ్లు నుంచి పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, పారిశుధ్య కార్మిక యూనియన్ మండల అధ్యక్షుడు జి. చంద్రశేఖర్, కార్యదర్శి జి.కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని జామీయా, మదీనా మసీదులలో ఈద్ మిలాద్ ఉన్ నబీ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముస్లింలు మసీదు నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ఊరేగింపు నిర్వహించారు. ముస్లిం మతపెద్ద ఇబ్రహీం మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా సమాజంలో శాంతి, శ్రేయస్సు, కరుణ వంటి విలువలను చాటి చెప్పేందుకే ఈ పండగను నిర్వహిస్తామన్నారు.

డ్రైవర్‌కు గాయాలు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం వెళ్లే రహదారిలో ఆటో, బస్సు ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం సాయంత్రం చోడవరం నుంచి అప్పలరాజుపురం మెట్ట సమీపంలోకి వచ్చేసరికి కె.జె.పురం గ్రామానికి చెందిన షేక్ బాబ్జి తన ఆటోను మరమ్మతులు చేయించేందుకు తీసుకెళ్తుండగా మలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు అయింది.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 39 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,230	4,900
రెండో రకం	3,730	3,750
మూడో రకం	నిల్	నిల్

అనకాపల్లి సినిమాలు

రాజా : మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1: కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2: ది కంజరింగ్ 4 లాస్ట్ రైట్స్
పర్తిసాయి : ఘాటీ
షిర్డీసాయి : కూలీ
వెంకటేశ్వర : లిటిల్ హర్ట్స్
రామచంద్ర : వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6, బీ పాజిటివ్-16, ఓ పాజిటివ్-31, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 365 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 323 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

బురదమయంగా బండిబాటలు





బురదమయంగా మారిన బండిబాట

- వర్షాలకు పాడైన దారులు
- పొలాలకు వెళ్లాలంటే ఆపసోపాలు
- కల్లాలకే పశువులు పరిమితం

తుమ్మపాల: అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నీరు చేరి నిలిచిపోతోంది. వరి నాట్లతోపాటు మొక్కజొన్న, చెరకు, రాగులు, వేరుశనగ, కూరగాయల పంటలకు మరింత నష్టం కలుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతుకు మొదటి నుంచి అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. పెట్టుబడులు పెట్టి కుదేలవుతున్న రైతును ఆదుకునే పాడిపరిశ్రమ ఇటీవల వర్షాలతో పూర్తిగా దెబ్బతింది. పశువుల కల్లాలు బురదమయంగా మారాయి. పశువుల చేల వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. గ్రామం నుంచి రైతుల కల్లాలకు, పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలు, వాగులు దాటి మహిళా రైతులు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

పొలాలకు చేరాలంటే వాగులు, చెరువులు దాటాల్సిందే...

అనకాపల్లి పట్టణానికి ఆనుకుని ఆవఖండం భూముల్లోకి వెళ్లాలంటే రైతులు మోకాలులోతు నీటిలో రాకపోకలు చేయాల్సి వస్తోంది. వాగులు, గెడ్డలు, చెరువుల ఆక్రమణతో నీరంతా పొలాల మీదకు చేరి నిలిచిపోయింది. మండలంలో శంకరం, తుమ్మపాల, రేబాక, కోడూరు, వెంకుపాలెం, పీతానగరం, కూండ్రం, కుంచంగి, మెట్టపాలెం, తదితర గ్రామాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పొలాలకు సరైన రోడ్డు లేక రైతులంతా గెడ్డలు, వాగులు దాటి పొలాలకు చేరుకుంటున్నారు. బండిబాటలు బురదమయంగా మారాయి. ఎక్కడ అడుగేస్తే కూరుకుపోతామే తెలియక పొలం పనులకు వదులుకుంటున్నారు. పశువుల కల్లాలోనే ఉంచేస్తున్నారు. పంటల సాగుకు రసాయనాలు వాడుక ఎక్కువవడంతో భూమిలో వాటి మలినాల ద్వారా రైతులు నడవడటంతో అనేక రకాల జబ్బులు బారిన పడుతున్నారు.

అనారోగ్యం బారిన పశువులు

పొలాలతో పాటు మెట్టు భూముల్లో నీరు చేరడంతో పశువులు కల్లాలకే పరిమితమయ్యాయి. వ్యవసాయంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు పశువుల పోషిస్తు వచ్చిన పాల బిల్లులతో నెలవారీ ఖర్చులతో జీవనం సాగించే పరిస్థితులు పూర్తిగా దెబ్బతింటున్నాయి. వర్షపు నీరు వాగులు, వంకల మీదుగా పశువుల కల్లాలు మీదకు రావడంతో బురదమయంగా మారాయి. నీటితో కూడిన బురద మురుగులా తయారై పశువుల డెక్కల్లో చేరి పశువులకు అనారోగ్యం కారణమవుతుంది. దీంతో పశువులు జ్వరాలతోపాటు పలు రకాల జబ్బుల బారిన పడటంతో పాల ఉత్పత్తి పూర్తిగా పడిపోయింది. దీంతో రైతులు ఆర్థికంగానే. మానసికంగాను కుంగిపోతున్నారు. వ్యవసాయ అధికారులు, పశు సంవర్థక అధికారులు గాని కనీసం స్పందించలేదు. క్షేత్రస్థాయిలో పర్యటించకుండా నివేదికలను రూపొందించి ఉన్నతాధికారులకు పంపించి చేతులు దులుపుకుంటున్నారని పాడి రైతులు వాపోతున్నారు.

బురదలోనే పశువులు



అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పశువులూ.. కళ్లం దిబ్బలకే పరిమితమయ్యాయి. పశువుల పాకలు, దిబ్బలు పూర్తిగా బురదగా తయారయ్యాయి. పొలాల్లో పూర్తిగా నీరే ఉంది. పశువులకు మేత కూడా సరిగ్గా లేదు. పాల దిగుబడి తగ్గిపోయింది. బురదలో ఉండటంతో డెక్కల వాపులు వచ్చే అవకాశం ఉంది. వర్షాలు ఎక్కువ రోజులు కురవడంతో పశువుల పెంపకం చాలా కష్టంగా ఉంది.

– కె.వరహాలు, పాడి రైతు, రేబాక గ్రామం

అవగాహన చర్యలపై విఫలమవుతున్న అధికారులు

మండలంలో ఆరు వేల ఎకరాల మేర వరి విస్తీర్ణం, చెరకు, మొక్కజొన్న, పైర్లు మరో మూడు వేల వరకు ఉంటుంది. పంటల సాగుపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లో కనీసం అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు. అదేవిధంగా 25 వేల వరకు ఉన్న పశువుల ఆరోగ్యంపై ఎటువంటి జాగ్రత్త చర్యలు అధికారులు చేపట్టకపోవడంతో ప్రభుత్వంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులపాటు వర్షాలు పడినప్పుడు పశువులకు ఎలాంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందనే అంశాలపై రైతులకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ర్యాలీ



రాజయ్యపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలంటూ శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డీడీ వరలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే ఏర్పాటు చేసిన హెటెరో డ్రగ్స్ పరిశ్రమ వల్ల తీర ప్రాంతాల ప్రజలు అనేక రుగ్మతలతో బాధపడుతున్నారని వాపోయారు. తాజాగా బల్క్ డ్రగ్ పేరుతో పదుల సంఖ్యలో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను నాశనం చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే, అక్కడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ నాయకులు యనమల రామకృష్ణుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సైతం అక్కడ ఏర్పాటు చేయాలని తలపెట్టిన బల్క్‌డ్రగ్ పార్క్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళన చేశారన్నారు. అదే బల్క్‌డ్రగ్ పార్క్‌ను రాజయ్యపేటలో ఏర్పాటు చేస్తుంటే వీరు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజల ప్రాణాలు పోయినా పర్వాలేదా అని నిలదీశారు. ప్రాంతాల మధ్య వ్యత్యాసం చూపడం దారుణమన్నారు. బల్క్ డ్రగ్‌పార్క్ రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో నాగమణి, చంద్రకళ పాల్గొన్నారు.

పట్టణంలో అన్నసమారాధనలు



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: పట్టణంలో విజయరామరాజుపేట, శ్రీరామ్‌నగర్, వేల్పులవీధి, గాంధీనగరం, గవరపాలెం వినాయక మందిరాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. అంతకుముందు వినాయక విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80, 84 వార్డు ఇన్‌చార్జులు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, కొణతాల మురళీకృష్ణ, దాడి నారాయణరావు, గైపూర్ రాజు పాల్గొన్నారు.

మిరియాల కాలనీలో....

సంపత్ వినాయక యూత్ ఆధ్వర్యంలో స్థానిక మిరియాల కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కొణతాల నందిబాబు, బోచుపల్లి శ్రీనివాస్, మళ్ల జోగారావు, బొండా శ్రీను, మధు తదితరులు పాల్గొన్నారు.

విజయరామరాజుపేటలో...

విజయరామరాజుపేట వినాయకుని స్థానిక 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతి గురువుకే సాధ్యం



విశ్రాంత డిప్యూటీ డీఈవో గౌరీపతిని శాలువాతో సత్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: సృష్టిలో జన్మించిన ప్రతి వ్యక్తికి గురువే అభివృద్ధికి దోహదపడతారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక ఉడ్‌పేటలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని విశ్రాంత డిప్యూటీ డీఈవో కె.వి.గౌరీపతిని శాలువాతో శుక్రవారం ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి ఉన్నత శిఖరాలకు చేర్చే బాధ్యత గురువులకు మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి గురువులే దోహదం

కశింకోట: విద్యార్థుల అభ్యున్నతికి గురువులే దోహదంగా నిలుస్తారని వాసవీ క్లబ్ జిల్లా అధికారి కె. వెంకటేశ్వరరావు తెలిపారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కశింకోటలో మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేసే 9 మంది ఉత్తమ ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ కార్యకర్తను దుశ్శాలువాలు, జ్ఞాపికలు అందజేసి శుక్రవారం ఘనంగా సత్కరించారు. వారు అందిస్తున్న సేవలను ప్రస్తుతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి, దేశాభివృద్ధికి తరగతిలోనే పునాది పడుతుందన్నారు. వారి అభ్యున్నతికి అహర్నిశలు కష్టించి పని చేసేది గురువులేనన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని దేశాభివృద్ధికి ప్రయోజకులుగా ఉపాధ్యాయులే తయారు చేస్తారన్నారు. తాళ్లపాలెం హైస్కూలు హెచ్ఎం ప్రసాదరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, కె.సూర్యనారాయణ, వై. శ్రీనివాసరావు, మళ్ల కోటేశ్వరరావు, వి. రమేష్, డి.ఎస్. మల్లేశ్వరరావు, కె. వెంకటేశ్వరరావు, కశింకోట డీపీఎస్ జెడ్పీ హైస్కూలు పీడీ పెంటకోట కమల, అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవిలను సన్మానించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ కార్యదర్శి డి.వి.కె. గుప్తా, ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కశింకోటలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

రెవెన్యూ సిబ్బందిపై కార్పొరేటర్ సోదరుడి దౌర్జన్యం

- చినముషిడివాడలో రూ.5 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- ఆక్రమణదారులకు జీవీఎంసీ ముఖ్య ప్రజాప్రతినిధి, టీడీపీ నేత అండ!



తొలగింపును చర్యల్ని అడ్డుకుంటున్న బీజేపీ కార్పొరేటర్ సోదరుడు



ప్లాన్ లేకుండా నిర్మాణం చేయొద్దని జీవీఎంసీ ఇచ్చిన నోటీసు

పెందుర్తి: చినముషిడివాడలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న గొడౌన్ నిర్మాణంపై చర్యలకు దిగిన రెవెన్యూ సిబ్బందిని బీజేపీ కార్పొరేటర్ ముమ్మన దేముడు సోదరుడు దాలినాయుడు అడ్డుకుని, దౌర్జన్యానికి దిగారు. ఇక్కడ సర్వే నెం.109, 109/2, 92/2లో ప్రభుత్వం కాలనీలకు కేటాయించగా దాదాపు రెండెకరాల భూమి ఓ కుటుంబం కబ్జాలో ఉంది. దీనిపై చాలా ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. అందులో కూడా గతంలో చాలా నిర్మాణాలు జరిగిపోయాయి. ప్రస్తుతం 800 గజాల్లో నిర్మాణం కోసం తప్పుడు డాక్యుమెంట్‌తో పాటు ఓ పట్టాను ఏర్పాటు చేసుకున్నారు. ఆ స్థలంలో నివాసాల(వాస్తవానికి భారీ గొడౌన్)కు దరఖాస్తు చేసుకున్నారు. పత్రాలు సక్రమంగా లేకపోవడంతో జీవీఎంసీ తిరస్కరించింది. ఎట్టిపరిస్థితిలోనూ ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టొద్దని గత నెలలో నోటీసులు జారీ చేసింది. రెవెన్యూ అధికారులు కూడా ఆ నిర్మాణాన్ని నిలుపుదల చేశారు. అయినప్పటికీ గురువారం ఉదయం నుంచి దాదాపు 100 మంది కూలీలను పెట్టి రేయింబవళ్లు గొడౌన్ నిర్మాణం చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకట అప్పారావు ఆదేశాలతో ఆర్ఐ హరిప్రసూన బృందం గురువారం రాత్రి కబ్జాను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ బృందంపై కార్పొరేటర్ సోదరుడు దాలినాయుడు దౌర్జన్యానికి దిగాడు. మా స్థలం మా ఇష్టం అంటూ చిందులు తొక్కాడు. జీవీఎంసీ ప్రజాప్రతినిధితో పాటు టీడీపీ ముఖ్య నేత ఒకేసారి ఫోన్ చేయడంతో చేసేది లేక జీవీఎంసీ, రెవెన్యూ యంత్రాంగం అక్కడి నుంచి వెనుదిరిగింది. దీనిపై ఆర్ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

అప్పన్నను దర్శించుకున్న కేంద్రప్రభుత్వ కార్యదర్శులు



అప్పన్న ఆలయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కేంద్ర న్యాయశాఖ, న్యాయ వ్యవహారాల విభాగం కార్యదర్శి డాక్టర్ అంజు రతిరాణా, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి దీప్తి ముఖర్జీ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో అర్చకులు వారి పేరిట ప్రత్యేక పూజలు జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంలను ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు అందించారు.

క్యాన్సర్ రోగికి అరుదైన రక్తదానం

స్ఫూర్తిగా నిలిచిన దాత అనిల్‌కుమార్



మూలకణ మార్పిడి ద్వారా రక్తదానం(తెల్లరక్త కణాలు)చేస్తున్న అనిల్‌కుమార్

పెందుర్తి: చిన్న వయసులోనే ఓ యువకుడిని ప్రాణాంతక వ్యాధి కబళించింది. చికిత్స కోసం అరుదుగా అవసరమైన మూలకణ మార్పిడి జరగాలి. దీనికి దాత ముందుకు రావాలి.. ఎంతో సహనంతో ఉండాలి.. రిస్కును ఎదుర్కోవాలి.. అందుకు సిద్ధమయ్యాడు పెందుర్తి మండలం చింతలగ్రహారానికి చెందిన ఎల్లపు అనిల్‌కుమార్. వివరాలివి.. తాడేపల్లిగూడేనికి చెందిన సీహెచ్ సుగుణ్ కుమార్(21) అప్లాస్టిక్ అనీమియా(ఎముకల్లో రక్త కణాల వృద్ధి పూర్తిగా లోపించడం) అనే వ్యాధికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం నగరంలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పతిలో చేర్చారు. తొలిదశలో సుగుణ్‌కుమార్ తండ్రి ద్వారా మూలకణ మార్పిడి చికిత్స చేశారు. వెనువెంటనే అతనికి బి పాజిటివ్ రక్తం ఉన్న వ్యక్తి తెల్లరక్త కణాలు అవసరమయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ కీలక సభ్యుడు ఎల్లపు అనిల్‌కుమార్ ముందుకొచ్చాడు. క్యాన్సర్ ఆస్పత్రిలోని ప్రత్యేక గదిలో రక్తకణాల వృద్ధి కోసం ప్రత్యేక ఇంజెక్షన్ తీసుకున్నాడు. సాధారణంగా మనిషిలో 4 వేలు నుంచి 11 వేలు వరకు తెల్లరక్తకణాలు ఉంటాయి. దానం చేయాలంటే ఇంజక్షన్ ద్వారా వాటిని 36 వేలు వరకు పెంచాలి. ఇది జరిగాక అనిల్‌కుమార్ నుంచి తెల్లరక్త కణాలు సేకరించిన వైద్యులు సుగుణ్‌కు ఎక్కించి చికిత్స పూర్తి చేశారు.

బ్రిటిష్ సమాధుల స్థలంలో కట్టడాలను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

నర్సీపట్నం: నర్సీపట్నంలోని సర్వే నంబరు 9లో బ్రిటిష్ సమాధుల స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, తహసీల్దార్, ఆర్డీవో లాంటి ఉన్నతాధికారులున్న ప్రాంతంలోనే ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న వారికి అనుకూలంగా మాట్లాడటం దారుణమన్నారు. కొత్తగా నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ధిక్కరిస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తిగా ఉన్న ప్రాంతంలో అక్రమ కట్టడాలు జరుగుతూ ఉంటే చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. బతుకుదెరువు కోసం రోడ్డు పక్కన చిన్న దుకాణం పెట్టుకుంటే తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు ఒకేచోట ప్రభుత్వ స్థలం ఉన్న ప్రాంతంలో షాపింగ్ మాల్ కడుతూ ఉంటే ఎందుకు చర్య తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కోర్టు ఉత్తర్వులు అమలు చేసి అక్రమ కట్టడాలను తొలగించకపోతే బాధ్యులపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అడిగర్ల రాజు, పి.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



గెంజి రాజు

పరవాడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలాపువానిపాలేనికి చెందిన గెంజి రాజు(45) ఈ నెల 3 నుంచి కనిపించడం లేదని అతని బంధువులు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. వివరాలివి. ఆటో డ్రైవర్ రాజు ఈ నెల 3న ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి, ఎంతకీ ఇంటికి చేరుకోలేదు. ఆటో ఇంటి పక్కనే పార్క్ చేసి ఉంది. రాజు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు, తెలిసిన వ్యక్తులను రెండు రోజులుగా వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో అతని బంధువులు పోలీసులనాశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



పరవాడలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ నాగరాజు, వ్యవసాయాధికారి రమాదేవి

పరవాడ: కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు పరవాడ తహసీల్దార్ బి.నాగరాజు, మండల వ్యవసాయాధికారి రమాదేవి తమ సిబ్బందితో పరవాడ, పెదముషిడివాడ, నాయుడుపాలెం ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరవాడ గ్రామంలోని మూడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, ఎరువుల నిల్వలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పెదముషిడివాడ, నాయుడుపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి అక్కడ ఎరువుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాయుడుపాలెం, పెదముషిడివాడ రైతు సేవా కేంద్రాల్లో 9.345 టన్నుల యూరియా, ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద 11.249 టన్నుల ఎరువులు ఉన్నట్లు గుర్తించారు. తనిఖీల్లో ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగులకు క్విజ్ పోటీలు

పరవాడ: ఎన్టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి 4వ మేధా ప్రతియోగిత పవర్ క్విజ్ పోటీలను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఈ పోటీలు అనేక విధాలుగా దోహదపడతాయన్నారు. దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయాలతో పాటు వివిధ ఎన్టీపీసీ దక్షిణ ప్రాజెక్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 6 జట్లు 4 విభాగాల్లో పోటీపడ్డాయి. ఈ పోటీలు కేవలం ఉద్యోగ వర్గానికి చెందినవేనన్నారు. ఇందులో విజేతలైనవారు జాతీయ స్థాయి మేధా క్విజ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ బీబీ పాత్ర, క్విజ్ మాస్టర్ గౌతమ్ బోస్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు



కొండెంపూడిలో ప్రమాదంలో గాయపడిన యువకులు

బుచ్చెయ్యపేట: కొండెంపూడి గ్రామంలో శుక్రవారం సాయంత్రం బొలెరో వాహనాన్ని ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన కోమార చిరంజీవి, నరేంద్ర బైక్‌పై రావికమతం వెళ్లి గణనాథుడి అలంకరణ కోసం పూలదండలు తీసుకుని వస్తుండగా కొండెంపూడి వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిరంజీవి తలకు తీవ్ర గాయాలు కాగా.. నరేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం చోడవరం ఆస్పత్రికి తరలించారు.